కార్తీక దీపోత్సవానికి ఆహ్వానం


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందించిన వాసవి అసోసియేషన్ నేతలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ఎంజీ పార్కులో వాసవి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి, 17వ తేదీ మణికొండ శివాలయం ఆవరణలో నిర్వహించే అయ్యప్ప స్వామి మహా పడిపూజకు హాజరు కావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌ను ఆహ్వానించారు. బుధవారం ఆయన నివాసంలో వాసవి అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి, గురుస్వామి రాజేందర్‌గౌడ్‌లు ఆయనను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. కౌన్సిలర్‌లు కె.రామకృష్ణారెడ్డి, పి.శైలజ, బి.కావ్యశ్రీరాములు, నాయకులు శ్రావణ్‌కుమార్, బి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఐఏఎల్‌కు పురస్కారాలు


అవార్డులు స్వీకరిస్తున్న జీఎంఆర్ ప్రతినిధులు

శంషాబాద్: రియాద్‌లోని రియాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో ఇటీవల నిర్వహించిన సౌదీ ఎయిర్‌పోర్టు ఎగ్జిబిషన్ 2024లో జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (జీహెచ్‌ఐఏఎల్) వివిధ విభాగాల్లో అవార్డులు దక్కాయి. డిజిటల్ ఆవిష్కరణల్లో డిజిటల్ ట్విన్ విజేతగా అవార్డును దక్కించుకోగా ఎయిర్‌పోర్టు రెవిన్యూమేనేజ్ మెంట్ విభాగంలో స్మార్ట్ ట్రాలీ రన్నరప్‌గా నిలిచింది. ప్రయాణికుల సౌలభ్యానికి అనుగుణంగా తీసుకొచ్చిన అనేక ఆవిష్కరణలకు ఈ పురస్కారాలు దక్కినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా జీహెచ్‌ఐఏఎల్ సౌల్ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి ఎస్.జీకే కిశోర్ మాట్లాడుతూ... ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ అనుభూతిని అందించేందుకు జీహెచ్‌ఐఏ ఎప్పటికప్పుడు సాంకేతికను అందిపుచ్చుకుని అడుగులు వేస్తోందన్నారు. అంతర్జాతీయంగా వచ్చిన ఈ గుర్తింపు తమ మెరుగైన ప్రయత్నాలను ప్రోత్సహిస్తోందన్నారు.

‘రోడ్లపై వ్యాపారులు చేయొద్దు’


అత్తాపూర్‌లో వ్యాపారులకు జరిమానా విధిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్

అత్తాపూర్: ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించేలా ఎలాంటి ఆహార ఉత్పత్తులు విక్రయించినా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్‌గౌడ్ హెచ్చరించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రోడ్లపై ఇరువైపుల టీ, కాఫీ షాపులు, పండ్ల దుకాణాల సముదాయాలు ఛాట్ బండార్‌లు ఎవరికి వారు ఇష్టానుసారం ఏర్పర్చుకొని ప్రధాన రోడ్లపై ప్రయాణిస్తున్న వారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆయన తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను ప్రజలకు వీలుగా ఉండేందుకు ఏర్పాటు చేశారన్నారు. అత్తాపూర్‌లోని పరిసర ప్రాంతాల్లో వెలిసిన దుకాణాలకు జరిమానాలను విధించి హెచ్చరికలు జారీ చేశారు.

స్టాఫ్ కాలేజీని సందర్శించిన సీబీఐటీ బృందం



మణికొండ: బంజారాహిల్స్‌లో ఉన్న ప్రతిష్ఠాత్మకమైన అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌ను గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల స్కూల్ ఆఫ్ మానేజ్‌మెంట్ స్టడీస్ విభాగ సిబ్బంది, విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ఫ్యాకల్టీ డాక్టర్ కర్నాక్ రాయ్, మార్కెటింగ్ హెడ్, ప్లేస్‌మెంట్ సెల్ ప్రొఫెసర్ వెంకట్, ఈ మనీ ఫైనాన్స్‌లో డాక్టర్ ఎంఎం ఆలీ, సీనియర్ అడ్మిన్ అధికారి శ్రీనివాస్‌యాదవ్‌లు క్యాంపస్ అత్యాధునిక సౌకర్యాలు, వనరులు, నాయకత్వం, పరిపాలనా నైపుణ్యాన్ని గురించి వివరించారు. పాఠ్యాంశాలను పరిశ్రమల పోకడలతో సమలేఖనం చేయటం, విద్యార్థులను ఆచరణాత్మక పరిజ్ఞానంతో ఉద్యోగులుగా తీర్చిదిద్దడం గురించి వివరించారు. కార్యక్రమంలో సీబీఐటీ అధ్యాపకులు డాక్టర్ టీఎస్ పూర్ణచంద్రిక, డాక్టర్ పరమేశ్వరి, డాక్టర్ తులసీరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దారి ఇవ్వాలని వీసీకి వినతి


వీసీని కలిసిన నాయకులు

రాజేంద్రనగర్: శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీకి అనుకొని ఉన్న శివాలయంలో పూజలు చేసుకోవడానికి దారిని వదలాలని కోరుతూ బుధవారం హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ రాజిరెడ్డిని కలిసి కోరారు. అందుకు వైస్ చాన్సిలర్ సానుకూలంగా స్పందించి త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఒక నిర్ణయాన్ని తీసుకోనున్నట్లు వెల్లడించారు. జిల్లా జనరల్ సెక్రటరీ వై.శ్రీధర్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు, రంగ రజనీకాంత్, ఇ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా..

ముగిసిన రైతు వ్యవసాయ సదస్సు
- ఆకట్టుకున్న వ్యవసాయ పనిముట్లు
- ప్రకృతి సిద్ధంగా రూపొందించిన తినుబండారాలు


తక్కువ నీటితో పంటలకు నీరుపెట్టే స్ప్రింక్లర్స్


త్రీ వీల్స్ టాక్టర్


వివిధ ఆకులతో తయారు చేసిన వస్తువులు


రోబో స్ప్రే ట్రాక్టర్

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసర్చ్ మేనేజ్‌మెంట్ (నారమ్) నిర్వహించిన రెండు రోజులపాటు నిర్వహించిన రైతు వ్యవసాయ సదస్సు.. అందులో వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్ రైతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇందులో దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాలలోని వివిధ జిల్లా నుంచి వచ్చిన వారు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రధానంగా రోబో ట్రాక్టర్స్, త్రీవీల్స్ టాక్టర్, పట్టుపురుగుల కాయల నుంచి పట్టు తీసే యంత్రాలు, బిస్కెట్స్‌తో చేసిన టీ కప్పులతో పాటు చేతివృత్తుల వారు తయారు చేసిన వివిధ రకాల పనిముట్లను ఆయా స్టాల్స్‌లలో అందుబాటులో ఉంచారు. వీటితో పాటు మిల్లెట్స్‌తో తయారు చేసిన వివిధ రకాల తినుబండారాలు, వంటలకు వాడే నూనెలతో పాటు పలు ఉత్పత్తులను సుమారు 70 స్టాల్స్‌లలో అందుబాటులో ఉంచారు. నూతన స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఈ తరహా స్టాల్స్ ఎంతగానో ఉపయోగపడతాయని నారమ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.


పట్టుకాయల నుంచి దారం తీసే యంత్రం


వంట నూనెలు, తేనెలు


వివిధ రకాల మిలెట్స్


బిస్కెట్స్‌తో టీ కప్పులు తయారీ

వ్యక్తి అదృశ్యం


సంజయ్‌కుమార్

అత్తాపూర్: పని కోసం వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. అత్తాపూర్ పోలీసుల సమాచారం మేరకు... కర్ణాటక బీదర్ ప్రాంతానికి చెందిన సంజయ్ కుమార్(30) తన కుటుంబంతో కలిసి బతుకుదెరువు నిమిత్తం ఏడు నెలల క్రితం హైదరాబాద్‌లోని శివరాంపల్లి ప్రాంతానికి వచ్చి ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. మొయినాబాద్ ప్రాంతంలో ఉన్న తాజ్ హోటల్‌లో డ్రైవర్‌గా పని చేసేందుకు యాజమాన్యంతో ఒప్పంద కుదుర్చుకున్నాడు. విధి నిర్వహణలో భాగంగా అక్టోబర్ 16వ తేదీన ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి వెళ్లిన సంజయ్ కుమార్ 26 రోజులు గడిచిన ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో ఆందోళనకు చెందిన ప్రతిభ అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్రామిరెడ్డి, ఏఎస్‌ఐ కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వీసీని కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు

ఏజీవర్సిటీ: శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ రాజిరెడ్డిని నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, టైం స్కెల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు బుధవారం విశ్వవిద్యాలయంలో కలిసి తమ సమస్యలను వివరించారు. దశాబ్దకాలంగా వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. అనంతరం వందలాది మంది ఉద్యోగులు వారిని ఘనంగా సన్మానించారు. నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు యాదయ్య, చెంచు రామయ్య, టి.కుమార్, రజినీకాంత్, టైం స్కేల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు అమీర్, వెంకన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి

మణికొండ: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తే వారికి ప్రాణదానం చేసిన వారవుతామని, యువత సామాజిక బాధ్యతగా తరచూ రక్తదానం చేయాలని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... యువత సామాజిక బాధ్యత కలిగి ఉండటంతో పాటు సమాజంలోని కష్ట సుఖాలను తెలుసుకోవాలన్నారు. ఇలాంటి శిబిరాలు ఎంతో మందికి ఉపయోగపడతాయన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రతిమ సాయి వైద్యశాల వైద్యులు స్రవంతి, ప్రకాష్, రంజిత్, సారంగపాణి, లయన్స్ క్లబ్ సభ్యులు విజయలక్ష్మి, అరుణ, ధర్మేందర్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ జె.ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘వేధింపులకే సిద్ధేశ్వరి బలి’


సిద్ధేశ్వరి (ఫైల్)

అత్తాపూర్: అత్తమామలు, ఆడపడుచు వేధింపులు తాళలేకే ఇంట్లో ఒంటరిగా భావించిన సిద్ధేశ్వరి(20) ఆత్మహత్య చేసుకున్నట్లు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటరామిరెడ్డి తెలిపారు. అత్తాపూర్ పాండురంగానగర్‌కు చెందిన ప్రవీణ్‌స్వామికి కామారెడ్డి జిల్లా మద్నూర్ గ్రామానికి చెందిన సిద్ధేశ్వరిని ఆరు నెలల క్రితం ఇచ్చి వివాహం చేశారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి ఒకే ఇంట్లో కాపురం ఏర్పాటు చేసుకున్నారు. ప్రవీణ్ స్థానికంగా ఉన్న ఒక జ్యూవెలరీ షాపులో పని చేస్తుంటాడు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో జరిగిన శుభకార్యానికి వెళ్లగా భర్త ప్రవీణ్ దుకాణానికి వెళ్లాడు. తనను ఏ శుభకార్యానికి తీసుకెళ్లకపోవడంతోపాటు తనకు ఇంట్లో ఎలాంటి ప్రాధాన్యత కల్పించడం లేదనే మనస్తాపంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నామని సిద్ధేశ్వరి సాయంత్రం తన భర్త ప్రవీణ్‌కు ఫోన్ చేసింది. ఇరుగుపొరుగు వారు ఇచ్చిన సమాచారం మేరకు గడియ పెట్టి ఇంటిని పగులగొట్టి చూడగా సిద్ధేశ్వరి అప్పటికే మృతి చెంది ఉంది. ఈ మేరకు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి వివరించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనాలివ్వాలి


డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

రాజేంద్రనగర్: వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో కార్మికులకు ప్రభుత్వాలు ఇచ్చిన జీవోని అమలు చేయకపోవడం దారుణమని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి విమర్శించారు. జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జలమండలి రాజేంద్రనగర్ డివిజన్ జనరల్ మేనేజర్ సాయిలక్ష్మీని కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్మికులకు జీవో ఎంఎస్ నెంబర్ 60 ప్రకారం వాటర్ సప్లాయి విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రూ.19,500లు, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750లు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఈ జీవోని గత ప్రభుత్వం 2021 జూలై 11న విడుదల చేయడం జరిగిందన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీవో నంబర్ 60ని వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికులు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనుబంధ సంఘంలో టీఆర్ఎస్‌వీకేలో ఉన్నారన్నారు. కానీక ఆర్మికులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇప్పుడు కార్మికులు ఏఐటీయూసీ నాయకులను సంప్రదించారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోని అమలు చేయకుంటే రాజేంద్రనగర్ డివిజన్ జలమండలి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నేతలు మహేందర్, శ్రీనివాస్ రెడ్డి, చెన్నకేశవులు గౌడ్, ప్రవీణ్ యాదవ్, రామకృష్ణ, రమల, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడకు ఆదిత్య పరశ్రీ స్వామి


స్వామి వారిని సన్మానిస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మాజీ సర్పంచ్ గంగని హరికృష్ణ నివాసానికి శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరశ్రీ స్వామి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ స్వామి వారిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. స్థానిక నేతలు డప్పు నవీన్‌కుమార్, గడ్డం శేఖర్‌యాదవ్, వెంకటరెడ్డి, బొక్క అనంతరెడ్డి, గంగని రాజు, గంగని మహేందర్, రెడ్డిగాళ్ల రత్నం, గుండడ శేఖర్, గుండడ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలు నిరుపయోగం

- పిచ్చిమొక్కలతో ఆవరణ ప్రాంతాలు
- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు


చౌదరిగూడలో పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా మారిన క్రీడా ప్రాంగణం

శంషాబాద్ రూరల్: నిర్వహణ లేమి, నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలు క్రీడాభిమానులకు నిరాశనే మిగులుస్తున్నాయి. చెట్ల పొదలు, చెత్తాచెదారంతో ఆవరణ ప్రాంతాలు అధ్వానంగా తయారవుతున్నాయి.

◆ మండలంలోని వివిధ గ్రామాల్లో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సర్పంచుల పదవీకాలం ముగిసి సుమారు పది నెలలు గడిచింది. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. ఈ నేపథ్యంలో క్రీడా ప్రాంగణాల నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన ప్రాంగణాలను ఇలా నిరుపయోగంగా మార్చడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

◆ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రాంగణాలు ఆవాసాలకు దూరంగా ఉండటంతో వీటిని సద్వినియోగం చేసుకోవడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడంలేదని కూడా చెప్పొచ్చు. గ్రామానికి ఆనుకుని అనువైన స్థలాలు లేకపోవడంతో చాలా చోట్ల గ్రామాల్లో దూరంగా వీటిని ఏర్పాటు చేశారు. యువతలో క్రీడలపై ఆసక్తి పెంచడంతో పాటు గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఈ ప్రాంగణాలు ఎంతో ఉపయోగకరం. ఇలా అన్ని విధాలా ఆయా ప్రాంగణాలు ఆశించిన ఫలితాలను అందివ్వలేకపోతున్నాయి.

పిచ్చిమొక్కలతో...

ప్రాంగణాల పరిసర ప్రాంతాలు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. వర్షాలకు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. వీటిని తొలగించడానికి పంచాయతీ, ప్రత్యేక అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి క్రీడాప్రాంగణాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆర్టీఏ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఆర్టీఏ ఆఫీస్ ఏరియా, 94 బస్టాపు, ఎల్లమ్మ దేవాలయం, రెడ్డి బస్తీ, ఉప్పర్ కోర్టు ఏరియా, పీఎల్ఆర్ లగ్జరీ హోమ్స్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులకు సన్మానం


చైర్మన్, డైరెక్టర్లకు శుభాకాంక్షలు చెబుతున్న బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

బండ్లగూడ: నూతనంగా నియమితులైన నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణుకుమార్‌గౌడ్, డైరెక్టర్లు శేఖర్‌బాబుయాదవ్, తలారి ప్రేమ్‌కుమార్, రాజు, అబ్దుల్‌సాదిక్, బీవీ లక్ష్మిలను బుధవారం ఘనంగా సన్మానించారు. వారు తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ బండ్లగూడ జాగీరులోని తన స్వగృహంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నూతనంగా ఎన్నికైన చైర్మన్, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. నాయకులు డప్పు నవీన్, బోగాల శ్రీనివాస్, అమీన్, అంకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నియంత్రించాలి


కోదండరెడ్డిని కలిసిన రెడీమిక్స్ బాధితులు

మణికొండ: వేలాది మంది ప్రజలు నివసిస్తున్న చోట ఎలాంటి కాలుష్యం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వాలపై ఉంటుందని, వాటిని వెదజల్లే వాటిని నియంత్రించాల్సిన అవసరం ఎంతో ఉందని రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధి బోర్డు అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోదండరెడ్డి అన్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సరిహద్దులోని మైహోం అవతార్, హాల్‌మార్క్ వినిసియా గేటెడ్ కమ్యూనిటీలకు పక్కనే ఓ నిర్మాణ సంస్థ రెడీమిక్స్ ప్లాంట్లను నిర్వహిస్తుండటంతో దుమ్ము, ధూళి, శబ్ద కాలుష్యాలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. దీంతో ఆయన వారి సమస్యను విని తాను అధికారులతో మాట్లాడతానని, త్వరలో సమస్యను పరిష్కరించేలా చూస్తానన్నారు. అయినా చర్యలు తీసుకోకపోతే నివాసితుల ఆందోళనకు మద్దతు ఇస్తానని హామీ ఇచ్చారని నివాసితుల సంఘం నాయకులు గౌతమ్‌రెడ్డి తెలిపారు.

పేదలకు అండగా ఉంటాం



మణికొండ: తమ గ్రామంలోని పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జి.స్వరూపనగేష్‌యాదవ్ అన్నారు. తమ గ్రామానికి చెందిన చాకలి పాండు కూతురు వివాహానికి తాళి, కాలి మెట్టెలను ఆమె బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పేదల వివాహాలు, చదువులకు తమ వంతు సాయంగా నిరంతరం ఆర్థిక సహాయాలను అందిస్తున్నామన్నారు. పదవిలో ఉన్నా లేకపోయినా పేదల అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు.

టీపీజీఎల్‌లో ఆటమ్ ఛార్జర్స్ జోరు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ నాలుగో సీజన్‌లో టైటిల్ ఫేవరెట్ ఆటమ్ ఛార్జర్స్ దూసుకెళుతోంది. నాలుగో రౌండ్‌లో పూర్తి ఆధిపత్యం కనబరుస్తూ అత్యధిక పాయింట్లు సాధించింది. నాలుగో రౌండ్ లో 167 పాయింట్లు సాధించిన ఆటమ్ ఛార్జర్స్ ఓవరాల్‌గా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇదే రౌండ్‌లో రియిజ్ మాస్టర్స్ 161 పాయింట్లు సాధించగా..వ్యక్తిగత ప్రదర్శనల్లో గోల్డెన్ ఈగల్స్ ప్లేయర్స్ మిథున్ రెడ్డి, శేషా రెడ్డి 47 పాయింట్ల చొప్పున టాప్ ప్లేస్ లో నిలిచారు. నాలుగో రౌండ్ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో ఆటమ్ ఛార్జర్స్ 699 పాయింట్లతో టాప్ ప్లేస్ లో ఉండగా...టీమ్ దాసోస్ 675 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. రియిజ్ మాస్టర్స్ టీమ్ 674 పాయింట్లతో మూడో స్థానంలోనూ, ఎంవైకే స్ట్రైకర్స్ 672 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాయి.

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: జీహెచ్‌ఎంసీ పరిధిలోని భారతీనగర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు డివిజన్‌ల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని, ప్రతి కాలనీలో నిరంతరం చెత్త సేకరణ చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీలో, రహదారులలో సేకరించిన చెత్తను తక్షణమే తరలించాలని ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం 4 గంటల నుండి పారిశుద్ధ్య కార్మికుల విధులు ప్రారంభం కావాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో సైతం చెత్త సేకరణ చేపట్టాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ఉన్నత అధికారులతో పాటు పారిశుద్ధ్య విభాగం అధికారులు ప్రతి రోజు ఉదయం కాలనీలలో విధిగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బల్దియా డిప్యూటీ కమిషనర్ సురేష్, ఏఎమ్‌హెచ్ విజయ్‌కుమార్, రాంకీ సంస్థ జోనల్ ఇంచార్జ్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఏడు కార్లు స్వాధీనం.. కిలాడీ లేడీ కేసులో పురోగతి

గచ్చిబౌలి: సెల్ఫ్ డ్రైవ్ పేరిట ఎక్కువ అద్దె ఆశచూపి అదే కార్లపై లోన్ తీసుకున్న కిలాడీ లేడీ కేసులో రాయదుర్గం పోలీసులు పురోగతి సాధించారు. ఇప్పటికే నిందితురాలు ఉషా, ఆమె డ్రైవర్ మల్లేష్‌ను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. కార్లను కుదువబెట్టుకొని లోన్ ఇచ్చిన సాగర్, అనిల్‌లను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించిన అనంతరం 7 కార్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బీదర్, పూణే తదితర ప్రాంతాల నుంచి మరో 15 కార్లు స్వాధీనం చేసుకోవాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.